కరీంనగర్‌లో అభివృద్ధి పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తున్న మంత్రి గంగుల

సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి

- కాంగ్రెస్, బీజేపీలు వస్తే గుడ్డిదీపమే
- మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్ కార్పొరేషన్, అక్టోబర్ 2: తెలంగాణలో ప్రస్తుతం సాగుతున్న అభివృద్ధి, సంక్షేమం మరింతగా కొనసాగాలంటే సీఎంగా కేసీఆర్ ఉండాల్సినా అవసరం ఎంతైనా ఉన్నదని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని పలు డివిజన్లలో మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి విస్తృతంగా పర్యటించి, వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల మాట్లాడుతూ.. మళ్లీ ఆంధ్రా పాలకుల కాంగ్రెస్, బీజేపీ ముసుగు వేసుకొని తెలంగాణలోకి వస్తున్నారని, కేసీఆర్ నాయకత్వాన్ని కాదని వారికి అధికారమిస్తే రాష్ట్రం మళ్లీ గుడ్డిదీపంగా మారుతుందని అన్నారు. రాష్ట్రాన్ని ఇంకా అభివృద్ధి చేసుకోవాలంటే బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాల్సి ఉన్నదని స్పష్టం చేశారు. కరీంనగర్‌ను ప్రపంచ స్థాయిలో ఆకర్షించేలా పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే కేబుల్ బ్రిడ్జిని అందుబాటులోకి తెచ్చామని, మరో ఏడాది లోగా మానేరు రివర్ ఫ్రంట్‌ను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. మరోసారి తనను ఆశీర్వదిస్తే భావితరాలకు బంగారు బాటలు వేస్తానని హామీ ఇచ్చారు.

చేనేత కళ.. నైపుణ్యం భళా

- పట్టు చీరల తయారీలో నల్ల విజయ్‌ది ప్రత్యేక ప్రతిభ
- మొన్న ఉంగరం, నిన్న దబ్బణంలో ఇమిడేలా చీరల నేత
- నేడు ఊసరవెల్లి చీర నేసి ఔరా అనిపించుకున్న యువకుడు

ఇటీవల హైదరాబాద్‌లో ఊసరవెల్లి పట్టుచీరను ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్ (ఫైల్)

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): తెలంగాణ నేతన్నల కళానైపుణ్యం దేశ సరిహద్దులు దాటి ఖండాంతరాలకు వ్యాపిస్తున్నది. గతంలో సిరిసిల్ల నేత కళాకారుడు నల్ల పరంధాములు అగ్గిపెట్టెలో ఇమిడే చీరను నేసి దేశవిదేశాల్లో కళానైపుణ్యాన్ని చాటితే.. నేడు ఆయన కుమారుడు నల్ల విజయ్.. ఉంగరం, దబ్బణం రంధ్రంలో ఇమిడేలా చీరలు తయారు చేసి తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకుంటున్నాడు. తన కళానైపుణ్యానికి మరింత పదునుపెట్టి ఊసరవెల్లి(రంగులు మార్చే) పట్టు చీరను తీర్చిదిద్ది ప్రముఖుల ప్రశంసలందుకున్నాడు. ఈ చీరను ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఇటీవల బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఆవిష్కరించి.. నల్ల విజయ్ నేత కళను అభినందించారు. ఇలా నేత కళలో ప్రతిభను చాటు తూ.. ఔరా అనిపించుకుంటున్నాడు.

పట్టు శాలువాలు, చీరల తయారీలో దిట్ట

అగ్గిపెట్టెలో ఇమిడే పట్టు శాలువా తయారీకి 2012లో శ్రీకారం చుట్టాడు. కొత్తదనంతో తయారు చేసిన పట్టు శాలువాను మొదటగా తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామికి అందజేశాడు. తర్వాత నేసిన మరో శాలువాను అప్పటి అమెరికా అధ్యక్షుడు ఒబామాకు పంపించాడు. 2014లో ఉంగరంలో, 2015లో దబ్బణం రంధ్రంలో దూరేలా నేసిన పట్టు చీరలు పలువురి ప్రశంసలు అందుకున్నాయి. ఈ చీర తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి కూడా ఎక్కింది. 2016లో తామర నారతో నేసిన శాలువాను సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఆవిష్కరించి ఆయనకే సమర్పించాడు. విజయ్ నైపుణ్యాన్ని సీఎం కేసీఆర్ అభినందించారు. 2018లో పూర్తిగా వెండి కొంగుతో పట్టుచీర, 2019లో పరిమళాలు వెదజల్లే పట్టుచీరను సృష్టించాడు. 2020లో అరకిలో వెండితో, 2022లో పరిమళాలు వెదజల్లే పట్టు శాలువాను తయారు చేశాడు. తాజాగా 2023లో ఊసరవెల్లి (రంగులు మార్చే) పట్టు చీరను సృష్టించి ఐటీ శాఖ మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించుకొని ప్రశంసలు పొందాడు.

ఖమ్మంలో దివ్యాంగురాలికి గృహలక్ష్మి మంజూరు పత్రం అందజేస్తున్న మంత్రి పువ్వాడ

కేసీఆర్‌తో పేదల సొంతింటి కల సాకారం

- మూడోసారీ ముఖ్యమంత్రి కేసీఆరే
- రవాణాశాఖ మంత్రి అజయ్‌కుమార్

ఖమ్మం, అక్టోబర్ 2: పేదవారి సొంతింటి కలను ముఖ్యమంత్రి కేసీఆర్ నిజం చేశారని, జీవో 58, 59 కింద ఇండ్ల పట్టాలు, గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షల సాయం అందజేస్తున్నారని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో సోమవారం ఆయన జీవో 58, 59 లబ్ధిదారులు 91 మంది, గృహలక్ష్మి పథకం లబ్ధిదారులు 119 మందికి మంజూరు పత్రాలను అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న పేదలకు వారి ఆధీనంలో ఉన్న ఇంటి స్థలాన్ని వారికే పూర్తి హక్కులు కల్పించినట్టు తెలిపారు. నిరుపేదలు ఆత్మగౌరవంతో బతకాలి అన్నదే సీఎం కేసీఆర్ ప్రథమ సంకల్పమని చెప్పారు. అందుకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి నిరంతరాయంగా కొనసాగాలంటే ప్రజలు మరోమారు బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని సూచించారు.

ఖమ్మం జిల్లా వైరా రోడ్ షోలో అభివాదం చేస్తున్న ఎంపీ నామా. చిత్రంలో వైరా ఎమ్మెల్యే రాములునాయక్, వైరా బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్

గ్యారెంటీలు.. వారంటీలను నమ్మొద్దు

- సంక్షేమాన్ని, అభివృద్ధిని నమ్మండి
- ప్రజలకు ఎంపీ నామా పిలుపు

వైరా టౌన్, అక్టోబర్ 2: ప్రజలు గ్యారెంటీలు, వారంటీలు అంటున్న పార్టీలను నమ్మొద్దని, సంక్షేమాన్ని, అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలని ఎంపీ నామా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా వైరాలో తొలుత ఎమ్మెల్యే రాములు నాయక్, బీఆర్ఎస్ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి మదన్‌లాల్‌తో కలిసి రోడ్ షో నిర్వహించారు. అనంతరం పట్టణంలోని కమ్మవారి కల్యాణ మండపంలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్యారెంటీల గురించి మాట్లాడే పార్టీని గెలిపిస్తే రాష్ట్రం తిరోగమనంలోకి వెళ్తుందని నామా స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతలు సమష్టిగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. చిన్న చిన్న భేషజాలను పక్కన పెట్టి వైరా నియోజకవర్గం నుంచి మదన్‌లాల్‌ను గెలిపించి పార్టీ అధినేత, సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని కోరారు.

టికెట్ కాగితంతో సమానం: రాములు

ఎమ్మెల్యే టికెట్ తనకు కాగితంతో సమానమని వైరా ఎమ్మెల్యే రాములునాయక్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో తాను గెలుపు గుర్రం కాదని, అయినప్పటికీ బీఆర్ఎస్ ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థి మదన్‌లాల్ గెలుపుకోసం పనిచేస్తానని తెలిపారు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడే ఆలోచన తనకు లేదన్నారు. పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ నిర్ణయాన్ని శిరసా వహిస్తానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి మదన్‌లాల్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాములునాయక్ నాలుగున్నరేండ్ల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడారని, ఆయన మద్దతుతో వచ్చే ఎన్నికల్లో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. రాములు నాయక్ కృష్టుడు అయితే.. తాను అర్జునుడి లాంటి వాడిని అని సభాముఖంగా ప్రకటించారు.

విద్యుత్తు షాక్‌తో చిన్నారి మృతి

- నందిపేటలోని షాపింగ్ మాల్‌లో ఘటన
- కుటుంబ సభ్యుల ఆందోళన

రిషిత (ఫైల్)

నందిపేట్, అక్టోబర్ 2: నిజామాబాద్ జిల్లా నందిపేట మండల కేంద్రంలోని షాపింగ్ మాల్‌లో విద్యుత్తు షాక్ తగిలి ఓ చిన్నారి మృతి చెందింది. నవీపేట్ మండల కేంద్రానికి చెందిన గూడూరు రాజశేఖర్ తన కుటుంబంతో కలిసి నందిపేట్‌లో ఉండే అత్తగారింటికి ఆదివారం వచ్చాడు. సోమవారం ఉద యం స్వగ్రామానికి వెళ్తూ నందిపేట మండల కేంద్రంలోని ఎన్ మార్ట్ షాపింగ్ మాల్‌లో సరుకులు తీసుకునేందుకు కూతురు రిషిత(4)ను తీసుకుని వెళ్లాడు. రాజశేఖర్ వస్తువులు తీసుకుంటుండగా రిషిత చాక్లెట్ కోసం ఫ్రిడ్జిని తెరువగా కరెంటు షాక్ తగిలింది. తండ్రి గమనించకపోవడంతో చిన్నారి కొన్ని సెకన్ల పాటు ఫ్రిడ్జికి వేలాడింది. కొద్దిసేపటి తర్వాత గమనించి పాపను ఎత్తుకొని మండల కేంద్రంలోని ప్రైవేట్ దవాఖానకు, అక్కడి నుంచి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందింది. మాల్‌లో ఉన్న ఫ్రిడ్జికి సాంకేతిక లోపం ఉన్నప్పటికీ యజమానులు పట్టించుకోకపోవడంతో కరెంట్ సప్లయి అయ్యిందని ఆరోపణలు వెల్లువెత్తాయి. కాగా.. కరెంట్ షాక్‌తో పాప మృతి చెందినప్పటికీ మాల్ యజమానులు తమకేం సంబంధం లేదన్నట్టుగా వ్యవహరించారు. తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంభసభ్యులు చిన్నారి మృత దేహాన్ని మాల్ ఎదుట ఉంచి 4 గంటల పాటు రాస్తారోకో చేశారు. స్థానికులు మద్దతు తెలుపడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్సై రాహుల్, తహసీల్దార్ ఆనంద్‌కుమార్ సంఘటనా స్థలానికి వచ్చి బాధితులను సముదాయించారు. మాల్ యజమానులపై కేసు నమోదు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

కార్పొరేట్ స్థాయిలో విద్య, వైద్యం

- సాగునీటితో మారిన జీవన శైలి
- వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి

రేవల్లి మండలం ఏదుట్ల శివారులో రైతు, కూలీలతో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి/పెద్దమందడి, అక్టోబర్ 2: ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పుష్కలంగా సాగునీరు అందుబాటులోకి వచ్చి ప్రజల జీవన శైలిలో మార్పులు వచ్చాయని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వనపర్తి జిల్లా గోపాల్‌పేట, ఖిల్లా ఘణపురం, పెద్దమందడి, రేవల్లి మండలాల్లో జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డితో కలిసి మంత్రి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వ స్కూళ్లు, దవాఖానల్లో కార్పొరేట్ స్థాయిలో విద్య, వైద్యం అందుతున్నదని చెప్పారు. స ర్కారు దవాఖానలపై భరోసా పెరిగి నేడు వైద్య సేవల కోసం బారులు తీరుతున్నారని తెలిపారు. భవిష్యత్తులో ఆధునిక వ్యవసా యం చేసిన వారికే డిమాండ్ ఉంటుందని, సామూహిక వ్యవసాయం వైపు రైతులు అడుగులు వేయాలని, ఈ విధానంలో కర్షకులకు అన్ని విధాలుగా మేలు జరుగుతుందని సూచించారు. ప్రజల బాగుకోసమే పనిచేస్తున్న ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. మున్ననూర్‌లోని 28 మంది దళిత రైతుల ఎగువ ప్రాంత భూములకు సాగునీరు అందించేందుకు మంత్రి కేఎల్ఐ కాల్వ వద్ద రెండు బోర్లు వేయించారు. అలాగే ఎస్సీ కార్పొరేషన్ కింద 7 బోర్లు మంజూరు చేయించారు. చెన్నూరు నుంచి గోపాల్‌పేటకు చదువుకునేందుకు వెళ్లే 8 మంది విద్యార్థినులకు సైకిళ్లు అందజేశారు. అనంతరం ఏదుట్ల శివారులో జయన్న తిరుమలాపురం రైతు పరగోర్ల శివ వేరుశనగ పొలంలో ఉన్న మహిళా కూలీలతో మాట్లాడారు. రేవల్లిలో రూ.4.87 కోట్లతో నిర్మించిన కేజీబీవీ నూతన భవనాన్ని మంత్రి ప్రారంభించారు.

బీఆర్ఎస్‌లోకి సీతక్క అనుచరులు

ములుగు, అక్టోబర్ 2(నమస్తే తెలంగాణ)/ ములుగు రూరల్, అక్టోబర్ 2 : ములుగు ఎమ్మెల్యే సీతక్క ముఖ్య అనుచరులు, పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. సీతక్క సొంత గ్రామమైన జగ్గన్నపేటకు చెందిన సుమారు 200 మందితోపాటు పొట్లాపూర్ సర్పంచ్ లతాఅంకిరెడ్డి, వార్డు సభ్యులు దనసరి సమ్మక్క, పాలడుగు రాకేశ్, లావుడ్య కవిత, యుగంధర్‌తో పాటు 100 మంది కాంగ్రెస్ నాయకులు సోమవారం ములుగు జడ్పీచైర్‌పర్సన్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి, రెడ్‌కో చైర్మన్ ఏరువ సతీశ్‌రెడ్డి, మాజీ మంత్రి చందూలాల్ తనయుడు అజ్మీరా ధరమ్‌సింగ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి నాగజ్యోతి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాళేశ్వరం 27వ ప్యాకేజీ రెడీ

- రేపు స్విచ్ ఆన్ చేసి నీటిని వదలనున్న మంత్రి కేటీఆర్
- నిర్మల్‌లో 50 వేల ఎకరాలకు అందనున్న సాగునీరు

దిలావర్‌పూర్ పంప్‌హౌస్ వద్ద ట్రయల్‌రన్‌లో భాగంగా పరుగులు తీస్తున్న కాళేశ్వరం జలాలు

నిర్మల్, అక్టోబర్ 2(నమస్తే తెలంగాణ): నిర్మల్ నియోజకవర్గంలోని 50 వేల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో చేపట్టిన కాళేశ్వరం ప్యాకేజీ-27 (శ్రీ లక్ష్మీ నర్సింహాస్వామి ఎత్తిపోతల పథకం) నిర్మాణ పనులు పూర్తయ్యి ప్రారంభానికి సిద్ధమైంది. ఈ పథకం కింద కాలువల నిర్మాణం కూడా పూర్తి కావడంతో ఈ నెల 4న మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు ముహూర్తం ఖరారు చేశారు. ఈ ప్యాకేజీ ద్వారా నిర్మల్ నియోజకవర్గంలోని దిలావర్‌పూర్, నర్సాపూర్ (జీ), కుంటాల, సారంగాపూర్, నిర్మల్, లక్ష్మణచాంద, మామడ, సోన్ మండలాల్లోని 99 గ్రామాల పరిధిలో చెరువులు, కుంటలకు నీరందించే అవకాశం కలిగింది. ఈ మేరకు బుధవారం స్థానిక మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్ కాళేశ్వరం ప్యాకేజీ-27కు స్విచ్ ఆన్ చేసి కాలువలకు నీటిని విడుదల చేయనున్నారు. నిర్మల్ జిల్లాకు తాగు, సాగు నీరందించే ప్యాకేజీ 27, 28 ఎత్తిపోతల పథకం, సదర్మాట్ బ్యారేజ్ పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్యాకేజీ 27 పనులు ఇప్పటికే 70 శాతం పూర్తి కావడంతో నిర్మల్ నియోజకవర్గానికి సాగు నీరందనున్నది. రూ.714 కోట్ల వ్యయంతో చేపట్టిన 27 ప్యాకేజీ ద్వారా నిర్మల్ నియోజకవర్గంలోని 99 గ్రామాలకు చెందిన దాదాపు 50 వేల ఎకరాలకు సాగునీరు అందనున్నది. అలాగే రూ.525 కోట్ల వ్యయంతో చేపట్టిన 28 ప్యాకేజీ కింద ముథోల్ నియోజకవర్గంలోని 58 గ్రామాలకు 50 వేల ఎకరాల్లో గోదావరి జలాలు పారనున్నాయి. నిర్మల్, జగిత్యాల జిల్లాల్లోని 18,016 ఎకరాలను స్థిరీకరించడం కోసం మామడ మండలం పోన్కల్ వద్ద గోదావరి నదిపై నిర్మిస్తున్న సదర్మాట్ బ్యారేజీ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఆ పనులు పూర్తయితే నిర్మల్ జిల్లాలోని చివరి ఆయకట్టుకు సాగు నీరందనున్నది.

- కలెక్టర్ దంపతుల రక్తదానం

మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా సోమవారం పెద్దపల్లిలో 6,006 మందితో పోలీసులు మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఆయన సతీమణి హమ్నా మరియాం ఖాన్ రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంపీ వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, రామగుండం సీపీ రెమా రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. – పెద్దపల్లిటౌన్

కాగితరహితంగా కేసుల విచారణ

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): సాంకేతికతను అందిపుచ్చుకొని కాగితరహితంగా కేసుల విచారణ చేపట్టాలన్న ప్రయత్నానికి హైకోర్టు మంగళవారం శ్రీకారం చుట్టనున్నది. పిటిషన్లను ఈ-ఫైలింగ్ ద్వారా దాఖలు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నది. ప్రయోగాత్మకంగా తొలుత ప్రభుత్వ న్యాయవాదులు, స్టాండింగ్ కౌన్సిల్స్‌తోపాటు, ఇతర న్యాయవాదులు, ఆదాయపు పన్నుశాఖ పిటిషన్లను ఈ-ఫైలింగ్ ద్వారా దాఖలుకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. ప్రభుత్వ న్యాయవాదులు, స్టాండింగ్ కౌన్సిళ్లు అన్నిరకాల కేసుల్లోనూ, ఇతర న్యాయవాదులు, పార్టీ ఇన్ పర్సన్లు, ఆదాయపు పన్ను కేసులను మంగళవారం నుంచి దాఖలు చేయాల్సి ఉంటుందని తెలిపింది. న్యాయవాదులకు బార్ కౌన్సిల్ జారీ చేసిన ఎన్‌రోల్‌మెంట్ నెంబర్, పుట్టిన తేదీ, లింగం, ఫోన్ నెంబరు, ఇ-మెయిల్ ఐడీలను హైకోర్టు సీఐఎస్‌లో సమర్పించాలని వివరించింది. ఎన్‌రోల్‌మెంట్ నెంబర్‌తోపాటు హైకోర్టు చేసిన కంప్యూటర్ కోడ్ కూడా సమర్పించాలని సూచించింది. ఈ విధానాన్ని అనుసరిస్తూనే అవసరమైన సమయంలో కోర్టుకు భౌతికంగా కాపీలను అందజేస్తామని న్యాయవాదులు హామీ ఇవ్వాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ న్యాయవాదులు, స్టాండింగ్ కౌన్సిళ్ల మార్పు అయితే ఆ విషయాన్ని హైకోర్టు రిజిస్ట్రీకి కూడా సమాచారం ఇవ్వాలని పేర్కొంది.

అటవీశాఖ అనుమతిస్తే ఆంక్షల తొలగింపు

- అప్పటిదాకా తిరుమల నడకదారిలో
- 12 ఏండ్లలోపు వారికి నో ఎంట్రీ: టీటీడీ

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): అలిపిరి నుంచి తిరుమలకు నడచి వచ్చే మార్గంలో వన్యమృగాల నుంచి ఎలాంటి ముప్పు లేదని అటవీశాఖ అధికారులు ధ్రువీకరిస్తేనే 12 ఏండ్లలోపు పిల్లల విషయంలో ఆంక్షలు సడలిస్తామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. తిరుమలలో భక్తుల రద్దీ నేపథ్యంలో చైర్మన్ సోమవారం గోగర్భం సర్కిల్ నుంచి కృష్ణతేజ సర్కిల్ వరకు క్యూలైన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. పెరటాసి మాసం, వరుస సెలవుల కారణంగా భక్తుల సంఖ్య పెరిగిందని తెలిపారు. దీంతో వీఐపీ బ్రేక్, సుపథం, స్లాటెడ్ దర్శనం టోకెన్ల జారీ కూడా రద్దు చేసినట్టు చెప్పారు. సర్వదర్శనానికి 35 గంటల సమయం పడుతున్నందున భక్తులకు ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 15 నుంచి నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఉన్నందున అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

నల్లమల్లలోకి పులి పిల్లలు

- 8 నెలల క్రితం తల్లినుంచి విడిపోయి జూపార్కుకు కూనలు
- 11 నెలలు నిండటంతో అడవిలో వదలనున్న అధికారులు

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): తల్లి నుంచి విడిపోయి తిరుపతి జూపార్క్‌లో పెరుగుతున్న పెద్దపులి కూనలు త్వరలోనే వాటి సహజసిద్ధ వాతావరణంలో అడుగిడనున్నాయి. పులిపిల్లలను నల్లమల్ల అభయారణ్యంలోకి తరలించేందుకు కొన్ని రోజులుగా అటవీశాఖ తీవ్రంగా కసరత్తులు ప్రారంభించింది. సుమారు ఎనిమిది నెలల కిందట నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం పెద్దగుమ్మడాపురంలో నాలుగు ఆడపులి పిల్లలు తల్లి నుంచి విడిపోయి స్థానికులకు కనిపించాయి. తల్లిపులి జాడ దొరకకపోవడంతో అటవీశాఖ అధికారులు పులిపిల్లలను తిరుపతిలోని వేంకటేశ్వర జూపార్కుకు తరలించి సంరక్షణ చర్యలు చేపట్టారు. ఆరోగ్యం విషమించి ఓ పులిపిల్ల జూపార్కులోనే మృతిచెందగా, మిగతా పిల్లలకు రుద్రమ్మ, హరిణి, అనంతగా నామకరణం చేశారు.

అనువైన ప్రాంతాల పరిశీలన

పులిపిల్లలు సురక్షితంగా ఉండేందుకు నల్లమలలోని అనువైన ప్రాంతాలను ఉన్నత స్థాయి అధికారులు మూడు రోజుల క్రితం పరిశీలించారు. చిన్నమంతనాల బీట్ పరిధిలోని పెద్దపెంట ప్రాంతం అనువుగా ఉందని నిర్ధారించారు. ఎన్ఎస్‌టీఆర్ అధికారులు తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

పులిపిల్లల కోసం ప్రత్యేక ఎన్‌క్లోజర్లు

ఫిబ్రవరి మొదటి వారంలో దొరికిననాటికి పులిపిల్లల వయస్సు మూడు నెలలు. ఇప్పుడు వాటి వయసు 11 నెలలు. వేటాడడం తెలియని పులిపిల్లలు జూ అధికారులు అందజేసే ఆహారంతోనే జీవిస్తున్నాయి. నల్లమలలో వీటికి ప్రత్యేక ఎన్‌క్లోజర్లు ఏర్పాటు చేసి కొన్ని రోజులపాటు వేటాడడం నేర్పిస్తారు. తర్వాత అభయారణ్యంలో వదిలి పెట్టే రీవైల్డింగ్ ప్రతిపాదనలనూ అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఒకే కాన్పులో నాలుగు ఆడ పులి పిల్లల పుట్టుక అపురూపమని పలువురు జంతు ప్రేమికులు పేర్కొంటున్నారు. భవిష్యత్తులో ఎక్కువ పులుల సంతానోత్పత్తికి అవకాశం ఉందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏపీ మాజీ మంత్రి బండారు అరెస్ట్

- మరో మాజీ మంత్రికి సీఐడీ నోటీసులు

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): ఏపీ మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత బండారు సత్యనారాయణమూర్తిని పోలీసులు అరెస్టు చేశారు. అనకాపల్లి జిల్లా వెన్నెలపాలెంలోని ఆయనకు 41ఏ, 41 బీ నోటీసులిచ్చి గుంటూరుకు తరలించారు. మంత్రి రోజాపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్న ఫిర్యాదుపై ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అలాగే, అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్ కేసులో మాజీ మంత్రి నారాయణకు సీఐడీ మరోసారి నోటీసులు పంపింది. 4న నారా లోకేశ్‌తో కలిసి విచారణకు హాజరు కావాలని తెలిపింది. కాగా, చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఢిల్లీలో భువనేశ్వరి, లోకేశ్ చేపట్టిన దీక్షను విరమించారు.

నేడు విద్యార్థులకు 'అలాయ్ ఫౌండేషన్' ట్యాబ్‌లు

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): గ్రామీణ నిరుపేద, అణగారిన విద్యార్థులకు డిజిటల్ విద్యనందించడంలో భాగంగా అలాయ్ ఫౌండేషన్ ముందుకొచ్చింది. వీ హబ్ సహకారంతో ఐదు జిల్లాల్లోని 350 మంది విద్యార్థులకు మంగళవారం ఉచితంగా ట్యాబ్‌లను పంపిణీ చేయనున్నది. ఖమ్మం, ములుగు, నిర్మల్, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి జిల్లాల నుంచి విద్యార్థులను ఎంపికచేయగా, వీరికి మంగళవారం హైదరాబాద్‌లోని ఎన్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ ట్యాబ్‌లను పంపిణీ చేస్తారు. కేజీబీవీల్లోని 20 మంది బాలికలు, సర్కారు బడుల్లోని మరో 20 మంది అబ్బాయిలను ఎంపికచేశారు. ప్రముఖ నేపథ్య గాయని స్మిత వల్లూరిపల్లి 'అలాయ్ ఫౌండేషన్'ను స్థాపించి, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

ఆర్టీసీ లాభాల్లో 'నల్లగొండ' టాప్

- ఐదు నెలల్లోనే రూ.12 కోట్ల లాభం
- లాభాల బాటలో నడుస్తున్న రాష్ట్రంలోని వివిధ డిపోలు
- సత్ఫలితాలిస్తున్న ఆర్టీసీ యాజమాన్యం ప్రయోగాలు
- సికింద్రాబాద్, హైదరాబాద్ రీజియన్లలో తప్పని నష్టాలు

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): టీఎస్ఆర్టీసీ యాజమాన్యం చేపట్టిన అనేక సంస్కరణలతో సంస్థ లాభాల బాట పట్టింది. టికెట్‌పై రాయితీలు, ప్రత్యేక బస్ సర్వీసులు, కార్గో సర్వీసుల వంటి వినూత్న ప్రయోగాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఈ మేరకు ఈ ఏడాది ఆర్టీసీ డిపోల వారీగా లాభసష్టాలను వెల్లడించింది. రాష్ట్ర వ్యాప్తంగా 11 రీజియన్లు, 95 బస్ డిపోలు ఉన్నాయి. వీటిలో నల్లగొండ రీజియన్ అత్యధిక లాభాలతో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ రీజియన్ పరిధిలోని 7 బస్ డిపోలూ ఈ ఏడాది లాభాలు సాధించినట్టు సంస్థ అధికారులు వెల్లడించారు. ఏప్రిల్-ఆగస్టు వరకు ఏకంగా రూ.12 కోట్ల లాభాలు సమకూరినట్టు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలోని 8 డిపోలకు 5, మహబూబ్‌నగర్‌లో 9కి 5, ఖమ్మంలో 6కి 5, వరంగల్‌లో 9కి 7 డిపోలు లాభాల్లో ఉన్నట్టు తెలిపారు. సికింద్రాబాద్ రీజియన్‌లో 11 బస్ డిపోలు నష్టాల్లోనే ఉన్నట్టు వెల్లడించారు. హైదరాబాద్‌లో 14కి 11, ఆదిలాబాద్‌లో 6కు 4, మెదక్‌లో 8కి 4, కరీంనగర్‌లో 11కి 5, నిజామాబాద్‌లో 6కు 3 డిపోలు నష్టాల్లో ఉన్నట్టు తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్ రీజియన్ల పరిధిలో చాలా మంది మెట్రోలు, ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తుండటంతో నష్టాలొచ్చినట్టు అధికారులు తెలిపారు.

సంస్థ కోసం నెలలో ఒక రోజు

నల్లగొండ రీజియన్ పరిధిలో ఉద్యోగులు, సిబ్బంది ప్రణాళికాబద్ధ పనితీరుతో ఆదాయం పెరిగింది. ఒక్కో డిపోలో 30 నుంచి 40 మంది ఉద్యోగులు నెలలో ఒక వారాంతపు సెలవురోజు సంస్థ కోసం అదనంగా పనిచ